క్లుప్తంగా

నేత్ర వైద్య శిబిరం నేడు

పెదబయలు: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు. కంటి ఆపరేషన్లకు అవసరమైన వారిని మంగళవారం మధ్యాహ్నం ప్రత్యేక వాహనంలో విజయనగరం తీసుకెళ్తామని, వారికి ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఈ శిబిరానికి కంటి విభాగాల స్పెషలిస్టులు, అత్యాధునిక కంటి వైద్య పరికరాలు ద్వారా పరీక్షలు చేయడం జరుగుతుందని తెలిపారు. దృష్టిలోపం, కంటి సంబంధ లోపాలు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కవి రమేష్‌కు అభినందనలు


రమేష్

వి.ఆర్.పురం: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ కళావేదిక నిరంతర సాహితి యజ్ఞంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీలో నూతన కార్యవర్గంలో పలువురికి అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో కమిటీ అధ్యక్షుడు నాయుడు ఆధ్వర్యంలో జాతీయ యువజన విభాగం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా మన్యం కవి నూనె రమేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

రహదారికి అడ్డంగా నిలిచిన లారీ

- రాకపోకలకు అంతరాయం



గూడెంకొత్తవీధి: మండలంలోని బూదరాళ్ల–బొంతువలస రహదారిలో పెద్ద లారీ ఆదివారం ఇరుకైన మలుపు వద్ద నిలిచిపోయింది. రోడ్డు ఇరుకుగా ఉండడం మూలంగా మలుపు వద్ద తిరగలేకపోయింది. అది అక్కడే నిలిచిపోవడంతో రెండు వైపుల నుంచి వచ్చే వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనాలు మినహా, ఆటోలు, కార్లు వెళ్లడం లేదు. లారీని తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

వరి విత్తనాలకు ప్రతిపాదనలు

రాజవొమ్మంగి: రానున్న ఖరీఫ్ సీజన్‌కు మండలంలోని రైతులకు సుమారు వెయ్యి టన్నుల వరి విత్తనాలు అవసరం ఉన్నట్టు అంచనా వేసినట్లు మండల వ్యవసాయాధికారి చక్రధర్ అన్నారు. ఈ మేరకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలోనే సబ్సిడీ వరి విత్తనాలు అందుబాటులోకి వస్తాయన్నారు. మండలంలోని వరి సాగు సాధారణ విస్తీర్ణం 6, 200 ఎకరాలు కాగా తొలివిడతలో 80 శాతం భూములకు సరిపడా వరి విత్తనాలు వస్తాయన్నారు. రైతులకు సరఫరా కానున్న వరి విత్తనాల్లో ముఖ్యంగా 1064 (అమర), 1121 (శ్రీధృతి), నెల్లూరి సన్నాలు, ఎంటీయూ 1318 వంగడాలు ఉన్నట్టు చెప్పారు.

కళా రంగాన్ని ప్రోత్సహించడం అభినందనీయం

కశింకోట: కశింకోటలో కళా రంగాన్ని ప్రోత్సహిస్తూ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికలను నిర్వహించడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. స్థానిక గవరపేటలో ఆదివారం నిర్వహించిన నాటిక పోటీలను ప్రారంభించారు. నాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అశోక్ ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ అధ్యక్షుడు బొడ్డేడ బలరామస్వామి, ఉపాధ్యక్షుడు ఆళ్ల మహాలక్ష్మినాయుడు, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి దేవినాయుడు, నాటక న్యాయ నిర్ణేత భీమరశెట్టి వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లా నుంచి, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి కుటుంబ సమేతంగా చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలో కొంతమంది భక్తులు శనివారం రాత్రి అమ్మవారి పాటను నిర్వహించి ఆదివారం తెల్లవారు జామున ఆలయం వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కుటుంబ సమేతంగా ఆలయం ఆవరణలో చలువ పందిళ్ల వద్ద వంటలు చేసుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు, భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జోరుగా సాగు

- వాతావరణం అనుకూలం
- వ్యవసాయ పనుల్లో గిరిరైతులు నిమగ్నం
- వరి, కూరగాయల సాగుపై ఆసక్తి


దుక్కి పనుల్లో రైతులు


పొక్లెయిన్‌తో భూమిని చదును


పంట వేసేందుకు సిద్ధం చేసిన పొలం

దుంబ్రిగుడ: మండలంలోని గిరిజన రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ప్రస్తుతం వేసవిలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వరి, కూరగాయల సాగుపై రైతులు ఆసక్తి కనుబరుస్తున్నారు. భూములకు దుక్కిటెద్దు, పవర్ టిల్లర్, నాగలితో దుక్కి పనులు చేస్తున్నారు. ప్రతి ఏటా మండలంలోని గుంటసీమ, రంగిలిసింగి, గుంటగన్నేల, తూటంగి, కొల్లాపుట్టు, సాగర, అరకు పంచాయతీల్లో వంద హెక్టర్లలో వరిని గిరిజనులు సాగు చేస్తున్నారు. సొవ్వా, అరమ, కంద్రూమ్ పంచాయతీల్లో కూరగాయలను ఎక్కువగా సాగుచేస్తున్నారు. ప్రస్తుతం వేసవిలో వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో రైతులు వారి గరువుల వద్ద పొలాల వద్ద చేరి దుక్కి దున్ని చదును చేస్తు పంట వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. కొంతమంది గరువులను పొక్లెయిన్‌లతో పొలాలుగా మరుస్తున్నారు.


పవర్‌టిల్లర్‌తో దుక్కి చేస్తున్న గిరిజన రైతు

గత జనవరి, ఫిబ్రవరిలో రబీ సిజన్‌లో సుమారు 50 హెక్టర్‌లలో వరి పంట సాగు చేస్తున్నారు. పంట కోత దశకు వచ్చింది. ప్రీ ఖరీఫ్ కోసం జూన్ మొదటి వారం నుంచి నారుమడులు చేస్తారు. అయితే ఈ ఏడాది మే నెలలో వర్షాలు కురుస్తుండడంతో ముందుగా సాగుకు సిద్ధం చేస్తున్నారు. సుమారు 30 హెక్టర్‌లలో వేరుశనగ పంటను రైతులు వేశారు. దీంతోపాటు పచ్చిరొట్ట విత్తనాం, కట్టె జనుములు పొలాలకు బలం, భూసారం కోసం పొల్లాలో వేస్తున్నారు. సాగుకు నీరు అందుబాటు ఉన్న ప్రతిచోట వరి పండిస్తున్నారు. ఏటా గిరిజన ప్రాంతంలో రెండు పంటలు సాగు చేస్తారు. కూరగాయలు సంవత్సరం పొడువునా సాగు చేస్తారు. రబీ సిజన్‌లో మాత్రం సుమారు 8 వేల ఎకారల్లో వరి పంట సాగు చేస్తారు. ఖరీఫ్‌లో మాత్రం తక్కువగా వరి పంటను సాగుచేస్తు కూరగాయల పంటల సాగుపై ఆసక్తి చూపుతారు. కొంత మంది రైతులు అల్లం పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కొండ పోడుతో పాటు గరువులలో అల్లం పంటను సుమారు 70 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.


అల్లం సాగులో రైతులు

అందుబాటులో వరి విత్తనాలు



"మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రాయితీపై వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో భాగంగా 750 క్వింటాళ్ల వరి విత్తనాల స్టాక్ ఉంది. ప్రస్తుతం 1121 ఎంటీ రకంతో పాటు 1818 రకం విత్తనాలు అందుబాటులో వచ్చాయి. 1014 రకంతో పాటు ఆర్ఎస్ఆర్ 15048 రకం విత్తనాలు రావాల్సి ఉంది. రైతులు సద్వినియోగం చేసకోవాలి."

– నీలవేణి, వ్యవసాయ అధికారి, దుంబ్రిగుడ

నిర్వాసితుల పట్ల నిర్లక్ష్యం తగదు


నిర్వాసితులతో మాట్లాడుతున్న సర్పంచ్ రామారావు, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు జయరాజు

వి.ఆర్.పురం: నిర్వాసితుల పట్ల పోలవరం ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్య వైఖరి విడనాడాలని చిన్నమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు. పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కోటం జయరాజు ఆరోపించారు. చింతరేగిపల్లి గ్రామం ఆర్అండ్ఆర్ పీడీఎస్ జాబితాలో ఇటీవల మృతి చెందిన వారి పేర్లు తొలగించడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వంలో నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. నిర్వాసితులపట్ల స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీనిపై కలెక్టర్, ఐటీడీఏ పీఓ, ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలన్నారు. మృతి చెందిన కుటుంబలకు న్యాయం చేయలని డిమాండ్ చేశారు. నేతలు రామారావు, సత్యనారాయణ, కరుణాకర్, దుర్గారావు, రామారావు, లక్ష్మణ్‌రావు, లక్షయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఎటపాక: తాము చదువుకున్న బడిలోనే తమ చిన్ననాటి మిత్రులను కలుసుకుని సంతోషాలను పంచుకున్నారు. ఈ ఆత్మీయ కలయికకు గౌరీదేవిపేట జెడ్పీహెచ్ఎస్ వేదిక అయింది. మండలంలోని గౌరీదేవిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఒకొరికొకరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సెల్ఫీలు తీసుకుని ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకుని పులకరించిపోయారు. ఉద్యోగాలు, ఉపాధి తదితర రంగాల్లో వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడి ఇలా కలుసుకోవటం సంతోషంగా ఉందని మురిసిపోయారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఆనాటి గురువులను సన్మానించారు. వారు నేర్పిన విద్య, సమాజ విలువలను గుర్తుచేసి గురువులకు నమస్కరించుకున్నారు. సాయంత్రం వరకు వారంతా ఆనందంగా గడిపారు.

రహదారి కోసం గ్రామస్తుల ఆందోళన


గ్రామంలో అధ్వాన్న రహదారిపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

- కొత్తూరులో చిత్తడి దారితో అవస్థలు
- వినతులు ఇచ్చినా పట్టించుకోని అధికారులు
- రోడ్డు నిర్మించాలని గ్రామస్తుల డిమాండ్

గూడెంకొత్తవీధి: మండలంలోని జర్రెల కొత్తూరుకు రహదారి లేని మూలంగా చుట్టు పక్కల పది గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారని రోడ్డు నిర్మించాలని స్థానికులు ఆదివారం ఆందోళన చేశారు. గతంలో ఆందోళన చేస్తే మెటల్ రోడ్డు వేసి వదిలేశారన్నారు. రోడ్డును పూర్తి చేయాలని అధికారులకు నేతలకు వినతులు ఇచ్చినా స్పందన లేదని వాపోయారు.
నేరుగా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినా స్పందన కరువైందని తెలిపారు. నేరుగా మంత్రులను కలిసి తమ గొంతును వినిపిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

ఉత్సాహంగా గుర్రాల పరుగు పోటీలు


పోటీలో తలపడుతున్న గుర్రాలు


పూజలందుకున్న అభయాంజనేయస్వామి

ఎస్.రాయవరం: హనుమజ్జయంతిని పురస్కరించుకుని సైతారుపేటలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి గుర్రాల పరుగు పోటీలుఉత్సాహంగా సాగాయి. గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సుమారు 15 మంది తమ గుర్రాలను స్వారీ చేస్తూ ఆకట్టుకున్నారు. ఇందులో అచ్యుతాపురం మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన గుర్రపు స్వారీ దారుడు అప్పారావుకి ప్రథమ బహుమతి రాగా, చోడవరానికి చెందిన గుర్రానికి ద్వితీయ స్థానం లభించింది. తృతీయ, నాలుగో, ఐదో స్థానాల వారికి కూడా నగదు బహుమతి ఇచ్చి ప్రోత్సహించారు. గుర్రపు పందేలు తిలకించేందుకు సైతారుపేట పరిసర ప్రాంతాలైన పేటసూధిపురం, వేమగిరి, సర్వసిద్ధి, జేపీపాలెం, ఎస్.రాయవరం తదితర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

నేటి నుంచి అమ్మవారి ఉత్సవాలు


అమ్మవారి విగ్రహం

అడ్డతీగల: అడ్డతీగల గ్రామదేవత ఇలవేల్పుగా కొలుచుకునే సోమాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి.జాతర మహోత్సవాల నిర్వాహకులుగాను అమ్మవారి ఆలయాన్ని రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. తొలిరోజు అమ్మవారికి విశేష పూజలు చేసిన అనంతరం ఆలయంలోని కొత్త చీరలు అలంకరించిన గరగలను నెత్తిన ధరించి డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి పుట్టింటికి తోడ్కొని వెళతారు. అనంతరం అమ్మవారి ఊయల రాటను తీసుకొచ్చి గరగల నృత్యాలు డప్పు వాయిద్యాల నడుమ జాతరను వైభవోపేతంగా జరుపుతారు. జాతర మహోత్సవాల కమిటీ సభ్యులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం

రంపచోడవరం: తమ గ్రామంలో చిన్నపాటి వర్షానికి విద్యుత్ నిలిచిపోతుందని పెదగెద్దాడ సర్పంచ్ వడగల ప్రసాద్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన పునరుద్ధరణకు తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఆదివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిచిపోతే సాయంత్రం వరకు కూడా పునరుద్ధరించలేదన్నారు. దీంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. విద్యుత్ లైన్ మన్ అసలు గ్రామవైపు కూడా రావడం లేదన్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్ కూడా పట్టించుకోవడం లేదన్నారు. వీరి తీరుపై విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాత సత్యనారాయణకు బాండ్ అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మాధవధార ప్రాంతానికి చెందిన పి.ఉమా వెంకట సత్యనారాయణ లక్షా 5 రూపాయల విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయ డొనేషన్ కౌంటర్లో ఇచ్చారు. దేవస్థానం తరఫున అన్నప్రసాద విభాగం ఏఈవో ఆనంద్‌కుమార్, పీఆర్వో కార్యాలయ సూపరింటెండెంట్ విక్రమ్ దాతకు బాండ్ అందించారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేష వస్త్రం అందజేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


ప్రచారం చేస్తున్న శ్రీనివాస్

అనకాపల్లి: దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని, మతాలు నిషిద్ధమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విశాఖ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. సుందర్యపేట, అచ్చయ్యపేట గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ గ్రంథాల ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలన్నారు. మన శరీరంలో దేవుడు మూడు ఆత్మలుగా విభజింపబడి ఉన్నాడని, జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం అని పేర్కొన్నారు. భగవద్గీతలో కర్మయోగం, బ్రహ్మయోగం, భక్తియోగం అనేవి దైవ ధర్మాలని, వాటి ప్రకారం నడుచుకుంటే కర్మ నుంచి బయట పడేసి మనిషికి ముక్తిని ఇస్తామన్నారు. సభ్యులు రమణ, నాగమణి, పద్మ, లక్ష్మి, త్రైత, సర్వధారి, దేవి, సత్యవతి, మీనాక్షి పాల్గొన్నారు.

144 మందికి వైద్య సేవలు


కురిడేలులో వైద్య శిబిరంలో గ్రామస్తులతో డాక్టర్ శ్రీనివాస్

జి.మాడుగుల: మండలంలో కురిడేలు, కోడిమామిడి గ్రామాల్లో ఆంధ్ర వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న ఉత్తరాంధ్ర తెలుగు సంఘం ఆర్థిక సహాయంతో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కురిడేలు గ్రామంలో 105 మందికి, కోడిమామిడి గ్రామంలో 39మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో వైద్య సేవలందించిన డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతినెలా 25న కురిడేలు, కోడిమామిడి గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో రోగులకు ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. అవసరమైన వారికి విశాఖపట్నం తరలించిన వివిధ శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు. మండలంలో ఉత్సవాలు, జాతర్లు జరిగే సమయాల్లో వైద్య శిబిరాలు అవసరమైతే వనవాసీ కళ్యాణ ఆశ్రమాన్ని సంప్రదిస్తే ఏర్పాటు చేస్తామన్నారు. సిబ్బంది సాయి, బాలరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర


యాత్రలో పాల్గొన్న భక్తులు

జి.మాడుగుల: మండలంలోని గాంధీగరం గ్రామంలో గాంధీనగరం హనుమ సేవాశ్రమం ప్రతినిధి సాయిరాం స్వామిజీ అధ్వర్యంలో ఆంజనేయ స్వామి శోభాయాత్ర ఆదివారం ఘనంగా జరిగింది. హనుమ సేవాశ్రమం నుంచి మెయిన్‌రోడ్డు, పాకలపాటి గురుదేవుల సన్నిధి సీతారామాలయం మీదుగా సేవాశ్రమానికి ఈ శోభయాత్ర సాగింది. ఈ సందర్భంగా మానవ సేవ, మాధవసేవ, గోసేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ కిముడు రాంబాబు, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యుడు మత్స్యరాస మత్స్యరాజు, విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు, ధర్మ ప్రసార జిల్లా ప్రముఖ్ అప్పలరాజు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు


రంపచోడవరం ఐటీడీఏ ఎదుట రిలే దీక్షకు మద్దతు తెలుపుతున్న సర్పంచ్ విజయ

రంపచోడవరం: అయిదవ షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాల నియామకాల కోసం ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ జెఏసీ నేతలు చేస్తున్న రిలే దీక్షలు ఆదివారం నాటికి 11వ రోజుకు చేరుకున్నాయి. రిలే దీక్షలకు ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు మద్దతు తెలిపారు. దీక్షను ఉద్దేశించి ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు , సర్పంచ్ వేట్ల విజయ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నుంచి షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసీ టీచర్ పోస్టులు మినహాయించాలన్నారు. ఆదివాసీ అభ్యర్థుల కోసం తక్షణమే ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి నూరుశాతం గిరిజనులతో భర్తీ చేయాలని, దీనిపై తీర్మానం చేయాలన్నారు. రిలే దీక్షలకు జెఏసీ కోర్ కమిటీ సభ్యులు కంగాల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు.

జంగిల్ క్లియరెన్స్ చేయరూ..


రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలు

కొయ్యూరు: ఇటీవల కురిసిన వర్షాలకు బూదరాళ్ల పంచాయతీలో చింతవాని పాలెం నుంచి బాలరేవుల రహదారిలో రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోయాయి.అవి రహదారిని కొన్ని చోట్ల సగం వరకు మూసివేస్తున్నాయి. ఈ తుప్పలు మూలంగా ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరుగుతాయన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ పనులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.